క్లుప్తంగా

96 మందికి కంటి పరీక్షలు



మక్కపేట(వత్సవాయి): వైఎస్సార్ కంటివెలుగు పథకం ద్వారా సోమవారం గ్రామ సచివాలయం ఆవరణలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభించిన పరీక్షలలో మొత్తం 96 మందికి కంటి పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రీనివాసరావు పరీక్షలు నిర్వహించారు. వారిలో 14 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. త్వరలో వారికి ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తుందని చెప్పారు. కళ్లజోళ్లు అవసరమని గుర్తించినవారికి ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుష్మాప్రియదర్శిని, హెల్త్ సూపర్‌వైజర్లు జవహర్‌లాల్, ఉషారాణి, తిరుమల, పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్, వీఆర్వో స్వామి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయంతో బోరు ఏర్పాటు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దాతల సహాయంతో సోమవారం తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన దాతలు భూక్యా గోపీకృష్ణ, ఆలయ పూజారి చక్రపాణి సహాయంతో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. రానున్న వేసవి కాలం నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా కొండ కింద బోరును ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పసుపులేటి సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో రాష్ట్రీయ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో సోమవారం సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కేవీకే కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రైతులు పంటల పెరుగుదలను బట్టి తగినంత మోతాదులో మాత్రమే ఎరువులు వేయాలన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫెర్టిలైజర్స్ ప్రతినిధి సంతోష్, శాస్త్రవేత్తలు శివప్రసాద్, వెంకటరెడ్డి, రాజశేఖర్, ప్రభావతి, లక్ష్మీకళ, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీఓ స్పందనలో ఆరు అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన ఆరు అర్జీలు అందాయని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించినవి మూడు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించినవి రెండు, నగర పంచాయతీకి సంబంధించినది ఒకటి మొత్తం ఆరు అర్జీలు అందాయన్నారు.

కంచికచర్లలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డే శ్వరపు రాజకుమారి సోమవారం తెలిపారు. పట్టణంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఒకటి, పట్టాదారు పాసుపుస్తకాలు 2, భూములను రీ సర్వే చేయాలని ఒక అర్జీ వచ్చాయని తెలిపారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏఓ కె.విజయకుమార్, ఎంఈఓ ఎల్.చిట్టిబాబు, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: స్పందన కార్యక్రమంలో దాఖలయ్యే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు అర్జీలు అందాయన్నారు. వాటిని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అతివలకు ఆసరా!

- మూడో విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీకి సర్వం సిద్ధం
- 25న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నియోజకవర్గంలో 4,223 డ్వాక్రా సంఘాలకు లబ్ధి



డ్వాక్రా మహిళలు(ఫైల్)

పెనుగంచిప్రోలు: స్వయం సహాయక సంఘాల సభ్యులకు శుభవార్త. మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద నిధుల విడుదలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గత రెండేళ్లుగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తీసుకున్న రుణాలను చెల్లించారు. మూడో విడత మార్చి 25న చెల్లించ టానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మూడో విడత నగదు అందించటం కోసం డ్వాక్రా మహిళల వేలి ముద్రల సేకరణను క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సంఘాల సహాయకులు పూర్తి చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఆసరా సొమ్ములు తీసుకుంటున్న లబ్ధిదారులు జీవించి ఉన్నారో, లేదో నిర్ధారించుకుంటున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుంటున్నారు.

నియోజకవర్గంలో...

వైఎస్సార్ ఆసరా పథకం కింద నియోజకవర్గంలో గత రెండేళ్లలో 4,193 గ్రూపులకు సుమారుగా రూ.72.61 కోట్లు జమ అయ్యాయి. ఈ ఏడాది పెనుగంచిప్రోలు మండలంలో 1183 గ్రూపులకు రూ.10,47,83,203, వత్సవాయి మండలంలో 1420 గ్రూపులకు 12,79,84,050, జగ్గయ్యపేట మండలంలో 1620 గ్రూపులకు 13,18,71,916 జమ కానున్నాయి. అర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



ఆసరా పథకం రెండో విడత సొమ్ము జమ చేసేందుకు డ్వాక్రా మహిళల వేలిముద్రలను బయోమెట్రిక్ ద్వారా సేకరించటం దాదాపు పూర్తయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 25న నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమ అవుతుంది.

–రాజారావు, వెలుగు ఏపీఎం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఆసరా పథకం ద్వారా మా గ్రూపునకు తీసుకున్న రూ.4 లక్షల రుణం మాఫీ అయింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత రుణమాఫీ కూడా చేస్తున్నారు. మా సంఘ ఆర్థిక ఎదుగుదలకు కారణమైన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–పి అరుణ, డ్వాక్రా మహిళ

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి



సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని లబ్ధిదారునికి అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన కార్యక్రమంలో పట్టణంతో పాటు పేట మండలంలోని పలువురికి అనారోగ్య కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.3,65,000ను ఉదయభాను లబ్ధిదారులకు అందజేశారు. పేట పట్టణానికి చెందిన మామిళ్లపల్లి విశ్వరూపాచారికి రూ.65 వేలు, వడేఘరు హేమలతకు రూ.1.20 లక్షలు, గుండబోయిన పాలెం గ్రామానికి చెందిన బొంత శ్రీనివాసరావుకు రూ 1.20 లక్షలు, బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల సావిత్రికి రూ.60 వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, నాయకులు టీఎస్ బ్రహ్మం, బూడిద నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: వార్డుల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని శివగంగ కాలనీలో విద్యుత్ శాఖ వారు నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం చైర్మన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శివగంగ కాలనీలో లోవోల్టేజ్ సమస్య ఉండటంతో స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి కాలనీలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, కొలగాని రాము, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాబు, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు ఏసుపాదం, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లక్ష్మీనారాయణ, నాయకులు కాశి కిషోర్, చిరంజీవి, శ్యామ్‌లాక్, మీరా, విజయకుమార్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లూర్థుమాత ఆలయ వార్షిక మహోత్సవాలు



వాక్యోపదేశం చేస్తున్న విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

వీరులపాడు: క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైనవని విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్థుమాత ఆలయ 74వ వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి ఫాదర్ సాలె వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసస్ మార్గం ప్రేమ మార్గమని ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కర్ల స్వాతి, నాయకులు రాజు, దాసు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి అమానుషం

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్



జగ్గయ్యపేట అర్బన్: సాక్షాత్తూ అసెంబ్లీ వేదికగా వైఎస్సార్ సీపీకి చెందిన ఒక ఎస్సీ ఎమ్మెల్యేపై టీడీపీ అగ్రవర్ణాల ఎమ్మెల్యేలు దాడి చేయడం అమానుషమని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కన్నమాల శామ్యూల్, మండల ఎస్సీ నాయకుడు చిరంజీవితో కలిసి ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. సంతనూతలపాడు ఎస్సీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై అసెంబ్లీ సాక్షిగా కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదే రీతిలో వారు కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఎస్సీలంతా తమ ఆగ్రహాన్ని చూపించి తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

ఉచితంగా ఎంసెట్ ఆన్‌లైన్ ప్రక్రియ

నందిగామ: ఇంటర్ తర్వాత ఎంసెట్ రాసే విద్యార్థులకు ఉచితంగా సేవలందించనున్నట్లు శ్రీ అక్షర కంప్యూటర్స్ యజమాని చింతల ప్రభాకరరావు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తరువాత ఈ ఏడాది ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థులకు మంగళవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఉచితంగా ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పట్టణంలోని ఎన్టీఆర్ రోడ్ (సీఎం రోడ్) లోని తమ ఇనిస్టిట్యూట్‌లో సంప్రదించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు



నందిగామ: పట్టణంలోని చందర్లపాడు రహదారిలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు సోమవారం విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత నిలిపివేసిన విద్యుత్ సరఫరా ప్రాంతాలవారీగా రాత్రి 8 గంటల సమయానికి పునరుద్ధరించారు. సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది నూతన విద్యుత్ లైన్ లో ఏర్పాటులో రాత్రి పొద్దుపోయే వరకు నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో ఆధునీకీకరణ పనులు పూర్తయ్యేంతవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆ శాఖ ఏఈ దిబ్బయ్య కోరారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కోర్టులో విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. విజయవాడలోని భవానీపురం పోలీసులు న్యాయం కోసం వెళ్లిన న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనుంజయుడు మాట్లాడుతూ న్యాయవాది చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టకుండా న్యాయవాదిపై కేసు నమోదు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా సదరు న్యాయవాదికి న్యాయం జరగాలని, లేని ఎడల న్యాయవాదులంతా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.కాంతారావు, బి.నరసింహారావు, కె.రత్నబాబు, కృష్ణయ్య, సంతోష్, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, కరణం నరసింహారావు, ఆంజనేయులు, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పనితీరు ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

వత్సవాయి: పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల పనితీరును ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. వత్సవాయిలో సోమవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న అనే పేరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మోసాలను వివరించి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనను తెలపాలన్నారు. గృహసారథులు రోజుకు 10 ఇళ్ల చొప్పున పర్యటించాలన్నారు. స్టిక్కర్లు అంటించడంతో పాటు ఫొటోలు, వీడియోలు తీసి ప్రశ్నావళిలోని సమాధానాలను తెలుసుకోవాలని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయం చేసుకుని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, వైస్ ఎంపీపీలు కొలికపోగు వెంకటేశ్వర్లు, కాటేపల్లి రవిరామతులసి, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ పాదిలి పద్మాలక్ష్మీనారాయణ, సర్పంచులు వడ్డే పరమయ్య, కొట్టె నగేష్, నాయకులు గుత్తా శంకరరావు, రమాకాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆర్డీవో రవీంద్రరావు



పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: డివిజన్ పరిధిలోని అన్ని కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో గల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరు, తాగునీటి ఏర్పాట్లు, అవసరమైతే ఫస్ట్ ఎయిడ్ కోసం ఆరోగ్యశాఖ సిబ్బందికి సంబంధించిన అన్ని అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు చక్కటి వెంటిలేషన్ సౌకర్యం గల గదులు, తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్తగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రాగిజావ తయారీకి సామగ్రి అందజేత



పాఠశాలకు రాగిజావ తయారు చేసే సామగ్రిని అందజేస్తున్న కిరణ్మయి

నందిగామ(చందర్లపాడు): ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న రాగిజావ పంపిణీ కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని ఉచితంగా అందజేస్తామని ప్రధానోపాధ్యాయుడు జి.సుధాకర్ అన్నారు. మండల కేంద్రమైన చందర్లపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ తయారీకి అవసరమయ్యే సామగ్రిని అదే పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కాడ కిరణ్మయి సోమవారం పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మంగళవారం నుంచి పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాగిజావ ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. ఉచితంగా అవసరమైన సామగ్రిని అందజేసిన కిరణ్మయిని ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌ల సేవలు ఎనలేనివి



సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

కంచికచర్ల: మాజీ సర్పంచులు కాలవ సీతారామయ్య, వేమా నరసింహారావు చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో కాలవ సీతారామయ్య 31వ వర్ధంతి, వేమా నరసింహారావు 44వ వర్ధంతిని కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు సోమవారం నిర్వహించారు. ముందుగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచి వేల్పుల సునీత మాట్లాడుతూ కంచికచర్ల పట్టణానికి సీతారామయ్య, నరసింహారావు ఎంతో సేవలు చేశారని, ప్రజల కష్టాలను తెలుసుకుని అవసరాలను తీర్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు మాట్లాడుతూ కాలవ, వేమా అడుగుజాడల్లో నడుచుకోవాలని అన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు బొమ్మిశెట్టి భాస్కరరావు, కాలవ పెదబాబు, నాయకులు కాలవ వాసుదేవరావు, నంబూరు నరసింహారావు, కొత్తా కోటేశ్వరరావు, సూదుల మురహరి, కొండేటి వెంకటనారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరావు, మంగినేని బుడ్డియ్య, దేవరకొండ గురవయ్య, రాయల నరసింహారావు, నారిశెట్టి శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, బుడ్డి సత్యనారాయణ, వెలగలేటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చిక్కీల చోరీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి విద్యార్థులకు అందించే తినుబండారాలు చోరీ చేసిన ఘటన జరిగింది. వివరాలలోకి వెళితే పాఠశాలకు శనివారం సాయంత్రం రోజూ మాదిరిగానే ఉపాధ్యాయులు తాళాలు వేశారు. ఆదివారం సెలవు కావటంతో సోమవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చే సరికి ప్రధానోపాధ్యాయురాలి గది తాళం పగలగొట్టి ఉండటాన్ని చూశారు. లోపలికి వెళ్లి చూడగా రికార్డులు చిందరవందరగా ఉండటంతో పాటు విద్యార్థులకు అందించే చిక్కీ, రాగిపిండి, గుడ్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. బియ్యం బస్తాలను కూడా పడేశారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు తాళాలు వేస్తున్నా గుర్తు తెలియని వ్యక్తులు, ఆకతాయిలు పాఠశాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని ఆమె తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ రోగికి రూ. లక్ష సాయం

సీఎం ఆదేశంతో చెక్ మంజూరు చేసిన కలెక్టర్

తిరువూరు: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక బాలుడికి వైద్యం కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు. సంబంధిత చెక్కును తిరువూరు సోమవారం తహసీల్దార్ సురేష్‌బాబు బాధిత బాలుని తండ్రి మారిపోగు శ్రీనుకు అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవడం తో పాటు వారికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యంగా ఇటీవల ఆసుపత్రిలో ల్యాబ్‌కు సంబంధించి పలు ఫిర్యాదులు రావడంతో సంబంధిత యూనిట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల రక్త పరీక్షలు ఆసుపత్రిలోనే చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోజువారీ వస్తున్న రోగుల సంఖ్య రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వివరాలను సేకరించారు. ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలకు రోగులను పంపుతున్నట్లు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల వస్తున్న ఫిర్యాదులపై వెంటనే వివరణ ఇవ్వాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అవినీతికి తావు లేకుండా సిబ్బంది పారదర్శకంగా పనిచేసేలా తరచూ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ సీతారావమ్మకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో ఆయన వెంట పలువురు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.